గింది సరళ. "ముట్టూ చీకటి వుందని విసుక్కునే కన్నా తెగించి ఒక దీపం వెలిగించడం గొప్పని నువ్వే చెబుతుంటావుగా" అంటూ థియేటర్ వైపు నడిచాను.

ఆపరేషన్ థియేటర్‌లోకి అడుగుపెట్టిన తరువాత నాలో చిత్రమైన మార్పు వచ్చింది. అది వార్డు కానీ, క్లాస్ రూమ్ కానీ హఠాత్తుగా ఒక కవితావేశం ప్రతీకార జ్వాలలా మనసుపై దాడి చేసి నన్ను ఒక ట్రాన్స్‌లోకి విసిరివేస్తుండేది. ఆ క్షణం మనసులో కవితావేణువుల సవ్వడి లేదు. అన్ని అనుభూతుల్నీ మరచిపోయి క్రమశిక్షణ గల సైనికుడిలా మారాను.

చేతులు వాష్ చేసుకొని, గ్లవ్స్ వేసుకుని ఆపరేషన్ టేబుల్ వైపు కదిలాను. ఎనస్థటిస్ట్ అప్పటికే వచ్చి వున్నాడు. అనుభూతుల లోకాల కందని స్పర్శా రాహిత్యంలో వుంది పేషెంటు. "పేషెంటు తాలూకు బంధువులు విసిగిస్తున్నారు. సరళగారిని ఒకసారి బయటకు రమ్మని చెప్పండి." హడావుడిగావచ్చింది స్టూడెంటు నర్సు. "ఆపరేషనుకు ముందు పేషెంటు భర్త అవసరమైన రక్తాన్ని ఇస్తానని చెప్పి, తీరా యిప్పుడు డబ్బులిస్తాం ఎక్కడైనా కొనుక్కురండి అంటున్నారు. డబ్బు పెడితే వచ్చేదా రక్తం. అదీ బి. పాజిటివ్ బ్లడ్ ..." నర్సు గొణుగుతూంది. "వెళ్ళి ఆ సంగతి చూసి వస్తాను" అంటూ ప్రేమగా భుజం తట్టి బయటకు వెళ్ళింది సరళ.

పొత్తి కడుపుపైన, బొడ్డు కింద సన్నని ఇన్సెషన్ ఇచ్చాను. ఎందుకో చేతులు వణికాయి. కొన్నివందల సార్లు చూసి వుంటాను ఈ ఆపరేషను. అయినా చెప్పలేని భయం ఒళ్ళంతా పాకింది. చెమట ధారల మధ్య నా ఒళ్ళు వర్షిస్తున్న ఆకాశంలా వుంది.

చర్మం క్రింది లేయర్సుని వేరుచేసి, రక్తం ఆపడానికి పాడ్స్ పెట్టుకుని, లిగమెంట్సు ఆధారంగా యుటెరస్‌ని గుర్తుపట్టాను. లోపలి శిశువు శరీర భాగాల్ని నిర్ధారణ చేసుకొని యుటెరస్‌కు ఇన్‌సిషన్ ఇచ్చాను. ఉమ్మపొరను చీల్చి, చూపుడు వేలు సాయంతో శిశువు భుజాన్ని నొక్కి పట్టి మెల్లగా శిశువును బయటకు తీశాను. మగశిశువు. కార్డ్‌కు క్లాంప్ వేసి నర్సుకిచ్చాను. నర్సు పిల్లవాడి నోరు, ముక్కులు సక్ చేస్తోంది. నాలోని భయం, వణుకు ఎప్పుడు నా నుంచి దూరం అయ్యాయో తెలియదు. సూటిగా గమ్యం వైపు సాగే నావికుడిలా సాగిపోతున్నాను. తెగిన రక్తనాళాల్ని ఎప్పటికప్పుడు లిగేట్ చేసుకుంటూ, ప్లాసెంటాను బయటకు లాగివేసి మెల్లిగా సూచర్సు వేయడం మొదలుపెట్టాను. సూచర్సు పూర్తిచేసి గట్టిగా నిట్టూరుస్తున్నంతలో, వెనకనుంచి రెండు మెత్తటి చేతులు నా భుజంపై పడ్డాయి. సుకుమారమైన పెదవులు నా బుగ్గల్ని ముద్దాడాయి. సరళ కాబోలు అనుకుంటూ తిరిగి చూస్తే వసుంధరా మేడమ్.

"ఐ యామ్ ప్రౌడ్ ఆఫ్ యు మై బాయ్! ఎన్నో యేళ్ళ అనుభవమున్న డాక్టర్‌లా చేశావు ఆపరేషను. కీప్ ఇట్ అప్! నువ్వు యుటెరస్ ఓపెన్ చేస్తున్నప్పుడే వచ్చాను. నిన్ను డిస్టర్బ్ చెయ్యడం ఇష్టంలేక వెనక నుంచున్నాను. అండ్ థాంక్స్ ఫర్ సేవింగ్ మి ఇన్‌దిస్ క్రైసిస్. పేషెంటు కేమన్నా అయితే హాస్పిటల్ పరువు బజార్న పడేది. నువ్వు చేసిన సాహసం ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. చాలా రోజుల పాటు గుర్తుంచుకొంటానీ సంఘటనని" అంటూ మేడమ్ కాంప్లిమెంటు చేసింది. భాష వ్యక్తం చెయ్యలేనంత ఆనందంతో బయటకు వస్తుంటే అక్కడ సరళ జాడ లేదు. ఆ క్షణం తను అక్కడ లేకపోవడం - నన్ను ప్రశంసించకపోవటం, దిగులు అనిపించింది.

ఉద్వేగంతో డ్యూటీ రూమ్ వైపు వెళ్ళాను. రూమ్‌లో మంచంపై పడుకుని వుంది సరళ. "కంగ్రాట్స్! సిస్టర్ యిప్పుడే చెప్పింది ఆపరేషను సక్సెస్ అని. బాగా నీరసంగా వుండి నీకు కంపెనీ యివ్వలేకపోయాను. పేషెంటు తాలూకు బంధువులు రక్తం యివ్వనని మొరాయించారు. ఈ ఆపరేషనుకు బ్లడ్ ఎంత అవసరమో నాకు తెలుసు. నాది బి.పాజిటివ్ కదా..." సరళ నవ్వుతూ చెబుతున్నా నా కళ్ళలో నీళ్ళు. ఎంత త్యాగం! గోర్కీ కథ చదివినప్పుడు ఆ కథలోని పాత్రల మంచితనం, త్యాగనిరతి నన్ను విస్మయపరిచాయి. అలాంటి వ్యక్తులు కొద్దిమందైనా మన మధ్య వుండబట్టే ఇంత కుళ్ళు, ఇంత దుర్మార్గం, ఇంత మోసం వున్న ఈ ప్రపంచంలో మనం ఈ మాత్రంగానైనా బ్రతక గలుగుతున్నామనిపించింది. సరళ సజీవంగా మన మధ్య జీవిస్తున్న గోర్కీ పాత్ర. ●

(రిత్విక్‌కి పుట్టిన రోజు కానుకగా)

# చెవిలో పెన్ను•

## మంత్రాలకి చింతకాయలు రాలవు

నిరాడంబర జీవన విధానం పట్లా, ప్రకృతి ఆరాధన పట్లా మహాత్మా గాంధీకి ఆసక్తి కలిగించి, ఆయనకి ఒక రకంగా మార్గదర్శకునిగా వ్యవహరించి 'థూరో' ధార్మిక జీవనాన్ని గడుపుతూ కర్తవ్య దీక్షని ఎప్పుడూ మరవని ఒక గొప్ప కర్మయోగి!

ఓ మారు ఆయన దగ్గరికి ఓ రాజ్యాధినేత వచ్చి, ఈ లోకంలో కష్టాలూ కన్నీళ్ళూ లేకుండా చేసేమార్గం ఉపదేశించమని అడిగాడు. దానికి 'థూరో' చిరునవ్వు నవ్వి 'నీకో కథ చెప్తాను వినమని' అన్నాడు.

"నీలాగే పూర్వం ఒక మంత్రి ఒక దుకాణం దగ్గరికి వెళ్లాడు. అంగట్లో షావుకారు కూర్చునే పీట మీద షావుకారుకి బదులుగా ఒక దేవత కూర్చుని వుంది. "ఇక్కడ ఏం దొరుకుతాయి?" అని అడిగాడు ఆ మంత్రి. 'నువ్వు ఏం కోరుకున్నా, ఏం కావాలన్నా ఇక్కడ దొరుకుతుంది. నీ ఇష్టం వచ్చింది అడుగు" అంది ఆ దేవత.




"అయితే ఈ భూలోకంలో అందరూ శాంతిగా జీవించాలి. ఎవరికీ దుఃఖం బాధ వుండకూడదు. కరువులూ, కాటకాలూ, యుద్ధాలూ, తగాదాలూ, అనారోగ్యాలూ ఏం లేకుండా మనుష్యులంతా సంతోషంగా బ్రతకాలి. అలాంటి శాంతీ సంతోషం ఇస్తావా" అని అడిగాడు మంత్రి. దానికి ఆ దేవత చిరునవ్వు నవ్వి "నువ్వు అడిగినవి ఫలాలు. ఫలాలు ఇక్కడ అమ్మం. విత్తనాలు మాత్రమే అమ్ముతాం. ఆ విత్తనాలు పట్టుకెళ్లి నాటి వృక్షాల్ని పెంచి ఫలాన్ని పండించుకోవాలి" అని చెప్పి మాయమైంది." అని చెప్పి కథ ముగిస్తూ "తెలిసిందా మంత్రాలకు చింతకాయలు రాలవు. ఆనందంగా సుఖంగా జీవించాలి అనే కోరిక వున్నంత మాత్రాన సరిపోదు. అందుకు అవసరమైన కృషి కూడా చెయ్యాలి" అని హితబోధ చేశాడు.

—పోలాప్రగడ

పటిష్ఠమైన కట్టడాలకు
చిరకాల మన్నికకు
భీమ సిమెంట్